ప్రజాశక్తి
శనివారం 12 ఏప్రిల్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



గుంటూరు ధర్నాలో జనం

వక్ఫ్ చట్టసవరణపై కదంతొక్కిన ముస్లిములు

గుంటూరులో భారీ ధర్నా - పలు రాజకీయ పార్టీల మద్దతు - నరసరావుపేటలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

వక్ఫ్ చట్టానికి కేంద్రం ప్రభుత్వం చేసిన సవరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో వక్ఫ్ ప్రొటెక్షన్ జెఎసి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో జరిగిన ధర్నాలో వేలాది మంది ముస్లిములు పాల్గొన్నారు. ముఫ్తి ఖాజీ మజిల్ ఉలేమా, ముఫ్తి అబ్దుల్ బాసిత్, ముఫ్తి ఆసిఫ్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ముస్లిముల ఆర్థిక మూలాలను దెబ్బతీయటానికే ఈ చట్ట సవరణ చేశారని విమర్శించారు. చట్ట సవరణను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ధర్నాకు సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, వైసిపి, టిడిపి పార్టీలు ధర్నాకు మద్దతు తెలిపాయి. వైసిపి నాయకులు నూరి ఫాతిమా మాట్లాడుతూ మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి మైనార్టీలనూ ఇబ్బందులకు గురి చేస్తూనే ఉందన్నారు. ప్రజల్ని మతాల వారీగా మోడీ విభజిస్తున్నారని విమర్శించారు. నాన్ మైనార్టీలకు వక్ఫ్ బోర్డులో చోటు కల్పిస్తే రేపు ఒక మసీదు కట్టుకోవాలన్నా అడుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు మస్తాన్‌వలి మాట్లాడుతూ ముస్లిముల మధ్య విభేదాలు సృష్టించటానికి మోడీ ప్రయత్నిస్తున్నారన్నారు. వక్ఫ్ సవరణను కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోదని చెప్పారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఈ బిల్లుకు వ్యతిరేకంగా అనేక చర్చలు జరిగాయని, ఒక ముస్లిముగా చట్ట సవరణను తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ▶ 2లో



నరసరావుపేటలో నిరసన

మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు

వార్తలు లోపలి పేజీల్లో

జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వ

- సాగర్‌లో 140, పులిచింతలలో 34.11 టిఎంసీల నీటి మట్టం
- వేసవిలో కృష్ణా జలాల వినియోగంపై కొరవడిన ప్రణాళిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోతున్నాయి. వేసవి తీవ్రత పెరుగుతుండటంతో జలాశయాల నుంచి చెరువులకు నీటి విడుదల ఇంకా ప్రారంభించలేదు. నాగార్జున సాగర్ జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 312.04 టిఎంసీలు కాగా శుక్రవారం సాయంత్రానికి 140.49 టిఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. పులిచింతల జలాశయంలో గరిష్ట నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా ప్రస్తుతం 34.11 టిఎంసిల నిల్వ మాత్రమే ఉంది. ప్రకాశం బ్యారేజి వద్ద గరిష్ట నీటి నిల్వ 3.07 టిఎంసిలు కాగా అదే స్థాయిలో నీటి నిల్వ కొనసాగిస్తున్నారు. జలాశయాలకు తాగు, సాగునీటి విడుదల జరగడం లేదు.

గత ఆరు నెలల వ్యవధిలోనే సాగర్ నుంచి అవసరానికి మించి వాడుకున్నారని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఎపిపై కృష్ణా యాజమాన్య బోర్డుకు ఫిర్యాదు చేసింది. రబీ పంటలకు, తాగునీటికి కూడా ప్రస్తుతం తెలంగాణతో ముడిపిడి వినియోగించుకోవాల్సి ఉంది. గత ఫిబ్రవరిలో సాగర్ నుంచి 10 టిఎంసిలు తెలంగాణకు, ఆంధ్ర కలిపి విడుదల చేశారు. గత నాలుగు నెలలుగా వర్షాలు ముఖం చాటేశాయి. ఉమ్మడి జిల్లాలో వర్షపాతం చాలా సాధారణంగానే ఉంది. డిసెంబరు 20 తరువాత భారీ వర్షాలు కురవలేదు. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో చివరి దశలో ఉన్న మిర్చికి, రబీలో సాగు చేసిన వరి, ఇతర పంటలకు నీటి విడుదల గత నెల వరకు వారాబంది విధానంలో కొనసాగించారు. కానీ ప్రస్తుతం పంటలకు ఒక తడి అవసరం అంటున్నారు. మరోవైపు గుంటూరు, పల్నాడు జిల్లాలో తాగునీటి ఎద్దడి పెరుగుతోంది. గత ప్రభుత్వ హయంలో తాగునీటికి సంబంధించిన పనులు సకాలంలో పూర్తికాకపోవడం వల్ల అనేక పథకాలు పెండింగ్‌లో ఉన్నాయి.

గుంటూరు జిల్లాలో మొత్తం 260 రక్షిత నీటి పథకాలు ఉండగా వీటి నుంచి అన్నిగ్రామాలకు సకాలంలో తాగునీరు అందడం లేదు. ఇప్పటికి రాజధాని ప్రాంతంలో నీటి ఎద్దడి ఉంది. ప్రస్తుతం జీలజీవన్ మిషన్ ద్వారా రూ.119 కోట్లతో మొత్తం 604 పనులు మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.38.69 కోట్లతో 400 పనులు పూర్తి చేశారు. ఇంకా 126 పనులు జరుగుతున్నాయి. ఇంకా 72 పథకాలు చేపట్టాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 144 చెరువులు ఉండగా వీటిని పూర్తిగా నింపలేదు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.86.13 లక్షలతో రూపొందించిన కార్యాచరణం ప్రణాళిక ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. పల్నాడు జిల్లాలో వేసవి తీవ్రత పెరుగుతున్నా ఇంకా సాగర్ కాల్వల నుంచి చెరువులకు పూర్తి స్థాయిలో నీరు విడుదల కాలేదు. గత నాలుగు నెలలుగా జిల్లాలో తగిన వర్షాలు లేక చెరువులు, కాల్వలు ఎండిపోతున్నాయి. ప్రధానంగా తాగునీటికి గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పశువులకు కూడా నీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో పశుపోషకులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. పల్నాడు జిల్లాలో 200 గ్రామాల్లో, గుంటూరు జిల్లాలో 100 గ్రామాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. గుంటూరు జిల్లాలో 144, పల్నాడు జిల్లాల్లో 136 చెరువులకు పూర్తి స్థాయి నీటి విడుదలకు చర్యలు చేపట్టాల్సి ఉంది.



సాగర్ కుడికాల్వ (ఫైల్)



వినుకొండ పట్టణానికి తాగునీరు అందించే చెరువులు (ఫైల్)



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జీతం రాక జీవనం కోసం భిక్షాటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : తాము పని చేసినా జీతం సరిగా ఇవ్వని కారణంగా భిక్షాటన ద్వారా కుటుంబాల్ని పోషించు కోవాల్సిన దుస్థితి వచ్చిందని నరసరావుపేట మున్సిపల్ పారిశుధ్య బదిలీ కార్మికులు ఆవేదనకు గురవుతున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం 23 రోజులుగా ఆందోళన చేపట్టిన కార్మికులు శుక్రవారమూ భిక్షాటన ద్వారా నిరసనను కొనసాగించారు. తొలుత దీక్ష శిబిరంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ పూలమాలలేసి నివాళులర్పించారు. పూలే స్ఫూర్తితో పోరాడి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు. తమపట్ల వివక్ష, సమస్యల పట్ల నిర్లక్ష్యం అధికారులు, ప్రజాప్రతినిధులు కొనసాగిస్తే నిరవధిక సమ్మెకూ వెనకాడబోమని కార్మికులు హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు జె.వీరమ్మ, సమాధానం, సెల్వి, లత, నాగమణి, శ్రీను, చంద్రయ్య, రాజు, ఖాదర్‌వలి, వీరయ్య, సాంబయ్య, అబ్రహం, సాల్మన్, దేవా, జీవరత్నం, వీరకుమార్, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐహెచ్ఎంఆర్ డైరెక్టర్ ఉషా మంజూనాథ్

ఫార్మా రంగంలో నిపుణుల కొరత

విద్యార్థులు మరింత మెరుగ్గా తయారు కావాలి

బెంగుళూరు ఐహెచ్ఎంఆర్ డైరెక్టర్ ఉషా మంజూనాథ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఫార్మా రంగంలో నైపుణ్యం కలిగిన నిపుణుల కొరత ఎక్కువగా ఉందని బెంగుళూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఉషా మంజూనాథ్ చెప్పారు. బెంగుళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన ఫార్మా టెక్ కవరేజి-2025 సదస్సులో ఆమె మాట్లాడారు. ఫార్మాలో విద్యారంగం, ఔషధపరిశ్రమ మధ్య క్లిష్టమైన అంతరాలు ఉన్నాయని, ఫార్మసీ విద్యార్థులు మరింత నిష్ణాతులుగా తయారు కావాలని అన్నారు. విద్యాశాస్త్రం, పరిశోధన, కన్సల్టెన్సీ, శిక్షణ, సెంటర్ ఫర్ అడ్వాన్సింగ్,. డిజిటల్ హెల్త్ తదితర అంశాలపై మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ, పరివర్తనకు సంస్థ తమ చేస్తున్న కృషిని వివరించారు. సంస్థ సీనియర్ సలహాదారుడు, మాజీ ఐఎఎస్ అధికారి డాక్టర్ సిఎస్.కేదార్ మాట్లాడుతూ ▶ 2లో



పుస్తకావిష్కరణలో పాల్గొన్న వెంకటేశ్వరరెడ్డి తదితరులు

రచయితలకు ఆదర్శం విశ్వమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజారచయిత కొమ్మిరెడ్డి విశ్వమోహన్‌రెడ్డి రచనలను, ఆయన జీవితాన్ని పరిచయం చేస్తూ జ్వాలాశిఖ విశ్వమోహన్ పేరుతో జనసాహితి ప్రచురించిన పుస్తక పరిచయ సభ శుక్రవారం స్థానిక బందావన్ గార్డెన్స్‌లోని సీనియర్ సిటిజన్స్ సేవా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీడిఆర్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా హక్కులు ఇచ్చినట్టే ఇచ్చి, ఆ హక్కుల అమలు కోసం పోరాడుతున్న ప్రజా ఉద్యమ నాయకులను ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చిచంపుతున్న రాజ్యం కపట స్వభావాన్ని తన రచనల ద్వారా బట్టబయలు చేసిన విశ్వ మోహన్‌రెడ్డి అలాగే రాజ్యం చేతిలో హత్యకు గురికావడం యాధృశ్చికం కాదని అన్నారు. కల్పిత కథనాలకు దూరంగా, వాస్తవ జీవితమే వస్తువుగా పుంఖాను పుంఖాలుగా నవలలు రాసి కూడా ఏమాత్రం గుర్తింపు కోరుకోని విశ్వమోహన్ రెడ్డి రచయితలందరికీ ఆదర్శమని విరసం నాయకులు నల్లూరి రుక్మిణి అన్నారు. కార్యక్రమంలో ప్రజాసాహితీ సంపాదకులు పి.ఎస్.నాగరాజు, రచయిత కాట్రగడ్డ దయానంద్, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు శ్రీదేవి, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జనసాహితి అధ్యక్షులు దివి కుమార్ ప్రసంగించారు. సభకు జనసాహితి ప్రధాన కార్యదర్శి అరుణ అధ్యక్షత వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2020 పిఆర్‌సి వర్తింపజేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2020 పిఆర్‌సి వర్తింప చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా కోరారు. శుక్రవారం నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30ఏళ్లుగా కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేసినప్పుడల్లా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అమలు చేసి, మినిమం టైమ్‌స్కేల్ వర్తింప చేస్తూ వస్తున్నారన్నారు. కానీ 2020 పిఆర్‌సికి సంబంధించి నేటి వరకూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పిఆర్సి 2020ని అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా వర్తింప చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ హెూషేబాబు, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమానత్వం కోసం కృషి చేసిన పూలే

ప్రజాశక్తి- తాడేపల్లి

సమాజంలో ప్రజల మధ్య హెచ్చుతగ్గులు ఉండకూడదని, సమానత్వం సౌభ్రతత్వం కోసం జ్యోతిరావు పూలే చివరి వరకు కషి కొనసాగించారని టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు నివాళులర్పించారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డి దాసు, టి భాస్కర్, మురళి, ఎం గోపాల్ రావు, టి గోపి, వెంకట్ రెడ్డి, టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టసవరణపై కదంతొక్కిన ముస్లిములు

(మొదటి పేజీ తరువాయి)

ముస్లిములు ఐక్యంగా ఉండి చట్ట సవరణను తిప్పికొట్టాలన్నారు. ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎ.చిష్టీ మాట్లాడుతూ ప్రజలు ఐక్యంగా ఉంటే చట్ట సవరణను వెనక్కి తీసుకోక తప్పదని, ఈ విషయాన్ని గతంలో రైతు చట్టాలపై జరిగిన ఉద్యమమే నిరూపించిందని గుర్తు చేశారు. వక్ఫ్ భూముల్ని కార్పొరేట్లకు అప్పగించటానికి చేస్తున్న ఈ యత్నాన్ని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. నిరసనలఓ సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పాల్గొని మద్దతు తెలిపారు. వైసిపి నాయకులు జియావుర్ రెహ్మాన్, ముస్లిమ్ సమైక్య వేదిక నాయకులు అబ్దుల్ కలాం, ముస్లిమ్ ఐక్యవేదిక బాజీ, ఇన్సాఫ్ నాయకులు వలి, ముస్లిమ్ లీగ్ బషీర్ అహ్మద్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గుంటూరు ధర్నాలో వేదికపై వివిధ సంఘాలు, పార్టీల నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ముస్లిమ్ జెఎసి ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ జరిగింది. ప్రకాష్‌నగర్‌లోని ఈద్గా ప్రాంగణం వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆర్టీసీ బస్టాండ్, మల్లమ్మ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను, మత సామరస్యాన్ని కాపాడాలని అన్ని మతాలను సమానంగా చూడాలని, నల్ల చట్టాలను రద్దు చేయాలని, హిందూ ముస్లిం భాయ్ భాయ్ అని నినాదాలు చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ ముస్లిములను లక్ష్యంగా చేసుకొని మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి, ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రధాని మోడీ ఈ రాజ్యాంగ విరుద్ధ చట్టాన్ని తెచ్చారన్నారు. గతంలో తెచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేక పోరాటంలో 700 మంది రైతులు అమరులయ్యారని గుర్తు చేశారు. పలువురు ముస్లిమ్ నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 9 లక్షల ఎకరాలకి పైగా వక్ఫ్ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రే చట్ట సవరణని చెప్పారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోనాయకులు మౌలానా షాహిద్ రాజా, ముఫ్తీ రైస్ అహమ్మద్, రఫీ మౌలానా, మౌలాన బాసిత్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ మీరవలి, మాజీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, అబ్దుల్ గఫర్, సమైక్యా ఆంధ్ర ప్రదేశ్ ముస్లిమ్ జెఎసి రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కె జిలాని మాలిక్, ఎంఐఎం మస్తాన్, కరిముల్లా, గోల్డ్ గఫర్, పిడిఎం నాయకులు ఎన్.రామారావు, సిఐటియు నాయకులు డి.శివకుమారి, సిలార్ మసూద్, న్యాయవాదులు షరీఫ్, రజాక్, ఎల్ఐసి ఏజెంట్ యూనియన్ నాయకులు నభి బాజీ, ఖాదర్ బాషా, చాంద్‌బాషా పాల్గొన్నారు.



నరసరావుపేటలో నిరసన ర్యాలీ

ఫార్మా రంగంలో నిపుణుల కొరత

(మొదటి పేజీ తరువాయి)

ఇండియాలో ఆరోగ్య సంరక్షణ సిబ్బంది కొరత ఉందన్నారు. దేశాన్ని ప్రపంచ ఫార్మసీగా అభివర్ణిస్తూ వేగవంతమైన ఆవిష్కరణలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, మెరుగైన విద్యా వ్యవస్థల ద్వారా ప్రపంచ నాయకత్వం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. సిప్లా కంపెనీ బిజినెస్ యూనిట్ హెడ్ ఎస్.బెనర్జి మాట్లాడుతూ ఫార్మారంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అనుసంధానం వంటి చర్యల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని చెప్పారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సాంకేతిక అంశాలు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ యుగం, నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్య అంతరాన్ని పరిష్కరించాలన్నారు. ఫార్మారంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సహాకాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్, ఎన్‌టిఆర్ వైద్య సేవ సిఈవో, రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ డైరక్టర్ జనరల్ పి.రవి సుభాష్ వివరించారు. విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసబాబు, సెయింట్ మేరిస్ కళాశాల ప్రొఫెసర్ పుప్పాల రామన్‌కుమార్, సిద్దార్థ కళాశాల ప్రిన్సిపల్ ఎ.సునీత మాట్లాడారు.

ఘనంగా ఎఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవం

భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా ఏర్పడిన ఎఐకెఎస్

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

జాతీయోద్యమ స్ఫూర్తితో భూస్వామ విధానానికి వ్యతిరేకంగా ఏర్పడిందే ఏఐకెఎస్ జండా అని ఏ పి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అన్నారు. తాడేపల్లి మండలం, వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద, ఎంటిఎంసి పరిధి కుంచనపల్లిలో రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. సంఘం జెండాను రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై కేశవరావు, కౌలు రైతు సంఘం జెండాను వి కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో న్యాయవాదులు, విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొంటున్న సమయంలో రైతులు ఉవ్వెత్తున జాతీయ ఉద్యమంలో పాల్గొనడం వలన ఉద్యమం కొత్త ఊపును తీసుకువచ్చిందని అన్నారు. భూస్వామ్య, జమీందారీ విధానానికి వ్యతిరేకంగా 1936 ఏప్రిల్ 11న ఏఐకేఎస్ ఏర్పడిందన్నారు. ఈ ఉద్యమంలో దేశవ్యాప్తంగా అనేకమంది ప్రాణత్యాగం చేశారని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ సాయుధ పోరాటం కు నాంది పలికిందని ఆయన తెలిపారు. 90 ఏళ్ల చరిత్ర కలిగిన ఏఐకేఎస్ జెండా పోరాటం ఆవిర్భావ దినోత్సవం దేశవ్యాప్తంగా రైతులు జరుపుతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ 1981లో ప్రధానమంత్రిగా ఉన్న పీవీ నరసింహారావు 1991 లో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని ఆ క్రమంలోనే వ్యవసాయ రంగం దివాలా తీసింది అని అన్నారు. తద్వారా రైతుల ఆత్మహత్యలు దేస్వ్యాప్తంగా పెరిగాయన్నారు. కేంద్రంలో ఇప్పటికీ మూడుసార్లు అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆయన విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 13 నెలల పాటు దేశవ్యాప్తంగా రైతాంగం నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం నడిపారని అన్నారు. రైతంగం నడిపిన మహా ఉద్యమ పోరాటం ఫలితంగా నల్ల చట్టాలు రద్దు చేస్తామని చెప్పి హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసేందుకు కుట్ర పన్నారని ఆయన అన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న నేటి తరుణంలో దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, రాజధాని రైతు సంఘం నాయకులు టి బక్కి రెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కంచర్ల జేమ్స్, కొండా సుబ్బారెడ్డి, బి గోపిరెడ్డి, పార్వతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి, అమ్మిశెట్టి రంగారావు, ఎనుమల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు. కుంచనపల్లిలో ఏఐకేఎస్ జెండాను రైతు సంఘం గ్రామ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు ఆవిష్కరించారు.



వడ్డేశ్వరం వద్ద



ఉండవల్లిలో



తాడికొండలో



కొల్లిపరలో

ప్రజాశక్తి- తాడేపల్లి : ఏఐకేస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తాడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్లో జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, నాయకులు డి వెంకటరెడ్డి, ఎం శ్రీనివాసరెడ్డి, విజయ భాస్కరరెడ్డి, ఎం నాగిరెడ్డి, బి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజధాని ముఖద్వారం అయినా ఉండవల్లిలో శుక్రవారం జండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు జొన్నా శివశంకరావు, కె ఈశ్వర్ రెడ్డి, పి గాంధీ, ఈమని రామారావు, కోటేశ్వరరావు, రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ : రైతులు పండించిన పంటకు మద్దతు ధర చట్టం తేవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం తాడికొండ పోలీస్ స్టేషన్ వద్ద, మోతడక గ్రామంలో ఎఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఎగురవేసి మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకి మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నాడని రైతులకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని, భూ యజమానిత సంబంధం లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు అందించి కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఇమ్మడి రామారావు, చింతల భాస్కరరావు, పిచ్చిరెడ్డి, జొన్న కోటిరెడ్డి, సుభాని, కోటేశ్వరరావు, రామారావు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర : మండలంలో దావులూరు లైబ్రరీ సెంటర్‌లో రైతు సంఘం జండాను రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కంటి వేణుబాబు రవికుమార్ నాగరాజు శేఖర్ జీవరత్నము తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి విలువ ఆధారపు పన్నును రద్దు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్నుల పెంపువిధానాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్లో జరిగిన సిపిఎం పట్టణ కమిటీ విస్తృత సమావేశంలో ఆయ న పాల్గొని మాట్లాడారు. సమావేశానికి శ్రీనివాస్ కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లా డుతూ ఇప్పటికే తాడేపల్లి పట్టణంలో విజయవాడ నగరం కంటే అధికంగా పనులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చాలదన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం గతంలో లేని విధంగా ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానం తీసు కొచ్చిందని విమర్శించారు. సంవత్సరానికి 15శాతం చొప్పు న పెంచుకుంటూ పోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో సతమతమవుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు పెంచిన ఇంటి పన్నులు చెల్లించలేరని చెప్పారు. వైఎస్ జగన్ చెప్పుల్లోనే తన కాళ్లు దూర్చి కూటమి ప్రభు త్వం పాలన సాగిస్తోందని దుయ్య బట్టారు. అందు కు నిదర్శనమే గత ప్రభుత్వం తీసుకొచ్చిన 44/2020 జీవో నెంబర్ 198 అని ఆగ్రహం వ్యక్తం చేశా రు. పన్ను చెల్లింపు ఆలస్యమైతే 24శాతం వడ్డీ వసూలు చేస్తా మనటం దారుణమన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, జి సుబ్బారెడ్డి, ఎం శ్రీని వాస్ రెడ్డి, వైభర్న బాస్, డివి భాస్కర్ రెడ్డి, కే బాబురావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై నేతాజీ

పరీక్ష తప్పుతామనే భయంతో ఇల్లు విడిచి వెళ్లిన ఇద్దరు విద్యార్థినులు

12 గంటల్లోనే కేసు మిస్టరీని చేధించిన పోలీసులు



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి- తాడేపల్లి

విజయవాడ శ్రీ చైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్న తాడేపల్లి, పెదవడ్ల పూడికి చెందిన అన్నదమ్ముల కుమార్తెలు ఇరువురు పరీక్ష ఫెయిలవుతామనే భయంతో ఇల్లు విడిచి వెళ్లి పోయారు. సమయానికి పిల్లలు ఇంటికి రాకపోయేసరికి రాత్రి 11 గంటలకు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో బాలికల తల్లిదండ్రు లు ఫిర్యాదు చేశారు. తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ్ రాజు, ఎస్ఐ ఎస్.కే.ఖాజావలి క్షణం ఆలస్యం చేయకుండా సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించి బాలికలు ఇద్దరు హైదరాబాదులో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని పిల్లలను తీసుకుని వచ్చి శుక్రవారం మధ్యాహ్నానికి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన తమ పిల్లలు క్షేమంగా ఇంటికి రావడంతో తాడేపల్లి పోలీసు అధికారులకు, సిబ్బందికి విద్యార్థినుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం దూళీపాళ్ల గోరంట్ల వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. వాగులో మృతదేహం ఉబ్బి దుర్వాసన వస్తుండటం గమనించిన చుట్టు పక్కల రైతులు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమా చారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి 45 సంవత్స రాల వయసు, 5.6 ఆడుగుల ఎత్తు, కుడి చేతిపై శిలువ గుర్తు పచ్చ బొట్టు చేతిరి తెల్ల పూసల దారం ఉందని చెప్పారు. రూరల్ ఎస్ఐ అమీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు_న్నారు. గుర్తించిన వారు రూరల్ సిఐ 9440796231, ఎస్ఐ 8019998643 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కేంద్రాన్ని పరిశీలించిన ఏఎంఓ

ప్రజాశక్తి - చేబ్రోలు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరులో చేబ్రోలు మండలానికి సంబంధించిన సర్వేపల్లి రాధాకష్ణ విద్యార్థి మిత్ర (స్టూడెంట్స్ కిట్)ను నిల్వవుంచే కేంద్రాన్ని జిల్లా సమగ్ర శిక్ష నుండి ఎఎంఒ అనిల్ కుమార్ శుక్రవా రం పరిశీలించినట్లు మండల విద్యాశాఖ అధికారి ఆర్.సుబ్బారావు తెలిపారు. 2025-2026 విద్యా సంవ త్స రానికి సంబంధించిన ప్రభుత్వం ఇచ్చే ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, బాగులు భద్రపరచ డానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమలో చేబ్రోలు ఎంఇఓ రాయల సుబ్బారావు, నారా కోడూరు ప్రధానోపా ధ్యాయులు ఏడు కొండలు, ప్రథమ్ టీం జిల్లా కో-ఆర్డినేటర్ చక్రవర్తి, సువర్చల, అన్నామని పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వర్సిటీలో లఘు చిత్ర పోటీలు

ప్రజాశక్తి - ఎఎన్యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఏఎన్యు మహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లఘు చిత్రముల పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. 10 చిత్రాలు ఈ ప్రదర్శనలో ఈ పోటీలలో పాల్గొన్నాయి. పోటీలలో గెలుపొందిన ప్రథమ ద్వితీయ జట్లకు బహుమతులను అందజేశారు. మహో త్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కు క్రికెట్ వాలీబాల్ ఫుట్బాల్ త్రోబాల్ టెన్నికాయిట్ పోటీలను పరుగు పందాలను నిర్వహించారు. కార్యక్రమ కన్వీనర్ సిహెచ్ రవికుమార్ పర్యవేక్షించారు. ముగింపు కార్యక్రమంలో వర్సిటీ విసి కె.గంగాధర రావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి. సింహా చలం, ప్రిన్సిపాల్ పి సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం గోపికష్ణ డాక్టర్ డి చంద్రమౌళి అధ్యాపకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా - ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - చేబ్రోలు

జొన్న కంకులు వలిచే ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యా యి. వీరిలో తిరుపతమ్మ అనే మహిళ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో జరిగిం దని తహసిల్దార్ కే శ్రీనివాస శర్మ తెలిపారు. పొన్నూరు మండలం నండూరు గ్రామా నికి చెందిన తిరుమతమ్మ, ఆమె భర్త వెంకయ్య, శివమ్మ మండల కేంద్రమైన చేబ్రోలుకు కూలి నిమిత్తం శుక్రవారం బయలుదేరారు. ఉదయం నుండి ఒక చోట పని చేసిన వీరు మధ్యాహ్నాం 1:30 గంటలకు జొన్న కంకులు నూర్పి డి చేసే మిషన్ ట్రాక్టర్లో మరో చోటుకి వెళ్తుండగా మార్గంమధ్యలో ట్రాక్టరు బోల్తా పడింది. ఈ ఘటనలో వెంకయ్య నడుముకు దెబ్బ తగిలింది. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాల య్యాయని తహశీల్దారు తెలిపారు. ప్రమాద బాధితుల ను 108లో ప్రథమ చికిత్స కొరకు గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - నకరికల్లు : పొగాకు చుట్ట కాల్చుకుంటుండగా అగ్గిపుల్ల చీరపై పడి కాలినగాయాలతో వృద్ధురాలు మృతి చెందిన సంఘ టన చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం చల్లగుండ్ల గ్రామానికి చెందిన కంభంపాటి కోటేశ్వరమ్మ (76) పొగాకు చుట్ట తాగే అలవాటు ఉంది. ఈనెల 10వ తేదీన చుట్ట వెలిగించుకున్న అగ్గిపుల్ల చీరపై పడడంతో మంటలు వ్యాపించాయి. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమా రుడు వెంకట్రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

కెఎల్యులో నేడు మహిళా మహోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ లో శనివారం ఫెమ్ ఫ్లేర్ పేరుతో మహిళా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా సరిత ఐపిఎస్ అధికారిణితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఆమె తెలిపారు. మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్. ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, చైర్ పర్సన్స్ డాక్టర్ రూత్ రమ్య, డాక్టర్ ఐ.గోవర్ధిని, డాక్టర్ సిహెచ్. శ్రీకావ్య, కన్వీనర్లు డాక్టర్ కె.సోని,డాక్టర్ హరిత, డాక్టర్ ఎ.ప్రియా, డాక్టర్ పి.లక్ష్మి ప్రసన్న, డాక్టర్ వి.సైలజ, డాక్టర్ పి.రాజరాజేశ్వరి, డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ కోనేరు స్వప్న తదితరులు పాల్గొన్నారు.



గాలి బీభత్సానికి అరటి తోటలు ధ్వంసం

ప్రజాశక్తి -రెంటచింతల

గురువారం రాత్రి ఈదురు గాలులు బలంగా వియడంతో మంచి అదునులో ఉన్న అరటి తోటలు నేల వాలి రైతులకు భారీ నష్టం వచ్చింది. మిట్టగుడిపాడు, రెంటచింతల, రెంటాల, మంచికల్లు గ్రామాల్లో 18 ఎకరాల్లో సాగవుతున్న అరటి తోటలన్నీ పడిపోయాయి. చెట్లకున్న అరటి గెలలన్నీ పడిపోయాయి. కొంతమంది రైతులు అప్పటికే పొలాలకు నీరు పెట్టగా ఆ నీళ్లల్లో అరటి గెలలు మునిగిపోయాయి. ఎకరానికి వెయ్యి గెలల అరటి కాసిందని, అవన్నీ చేతికి దక్కకుండా పోయాయని రైతులు వాపోతున్నారు. ఒక్కొక్క గెలకు 300 కాయలు కాశాయని, తోట ఆశాజనకంగా ఉందనుకుంటున్న తరుణంలో గాలి బీభత్సం తమను నట్టేట ముంచిందని కన్నీరు మున్నీరవుతున్నారు. ఎకరాకు రూ.లక్షన్నర దాకా పెట్టుబడి పెట్టామని చెబుతున్నారు.



ప్రజాశక్తి - విజయపురిసౌత్ : గురువారం రాత్రి తీవ్రమైన గాలి బీభత్సం సృష్టించడంతో నాగార్జున సాగర్ జలాశయంలో మత్స్యకారుల మరబోట్లతో పాటు పుట్టీలు, వలలు ధ్వంసయ్యాయి. విజయపురిసౌత్‌లోని డౌన్ మార్కెట్‌కు చెందిన అర్జిల్లి సింహాద్రి, బొందు రాజులు కృష్ణా జలాశయంలో చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చేపల వేట అనంతరం బోట్లు, పుట్టీలను జలాశయం ఒడ్డున తాడుతో కట్టి నిలిపివేస్తుంటారు. ఎప్పటిలాగే చేపల బోట్లను ఒడ్డున నిలిపి ఉంచగా గురువారం రాత్రి అకస్మాత్తుగా భారీగాలి వచ్చింది. మత్స్యకారులు సాగర్ జలాశయం వద్దకు చేరుకొని బోట్లను, పుట్టీలను కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే అవి ధ్వంసమయ్యాయి. అర్జిల్లి సింహాద్రికి చెందిన మర బోటు, 2 పుట్టీలు, 4 మూటల వలలు దెబ్బతినడంతో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లగా, బొందు రాజుకు చెందిన మర బోటు, పుట్టి ధ్వంసం అవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రహదారులనూ తవ్వేస్తున్న మట్టి మాఫియా

ప్రజాశక్తి - నకరికల్లు : మైనింగ్ మాఫియా కన్నుబడితే రహదారులు కూడా మాయమవుతున్నాయి. నకరికల్లులోని మైనింగ్ జరిగే చెరువు ప్రాంతంలో గువ్వలబోడు నుండి చల్లగుండ్లకు మార్గంలో పొలాల రహదారిని వదిలిపెట్టకుండా ప్రొక్లెయిన్‌తో మట్టిని తవ్వుతుండడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు తీసిన దారిలో సుమారు 150 ఎకరంలో రైతులు వరి సాగు చేశారు. శుక్రవారం సాయంత్రం కొంతమంది రైతులు మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి పొలాలకు వెళ్లే రహదారి మట్టిని కూడా అమ్ముకుంటున్నారని తహశీల్దార్ పుల్లారావు దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చెప్పారు.




స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే

ఆయన జీవితాన్ని అందరూ తెలుసుకోవాలి : పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు - 199వ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘన నివాళులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సంఘ సంస్కరణలకు శ్రీకారం చుట్టి సమాజం కోసం ఎంతో పాటుపడిన మహాత్మా జ్యోతిరావు పూలే ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయమని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శుక్రవారం జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలేసి సమాజాభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి కలెక్టర్ పూలమాలలేసి మాట్లాడారు. అసమానతలు రూపుమాపేందుకు పూలే కంకణం కట్టుకోవడంతోపాటు మహిళలు చదువు కోసమూ తన భార్యతో కలిసి కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ సామాజిక తరగతులకు ఆర్థిక చేయూత కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. 2107 మందికి రూ.51 కోట్ల రాయితీ రుణాలు మంజూరు లక్ష్యంగా నిర్ణయించామని, 1136 మంది రూ.22.99 కోట్లు, 461 కాపులకు రూ.15.48 కోట్లు, 63 మంది ఈబీసిలకు రూ.1.66 కోట్లు, 204 మంది కమ్మ సామాజిక తరగతివారికి రూ.5.35 కోట్లు, 142 మంది రెడ్డి సామాజిక తరగతి వారికి రూ 3.71 కోట్లు, 66 మంది ఆర్య వైశ్యులకు రూ.1.71 కోట్లు, 3 మంది క్షత్రియులకు రూ.7 లక్షలు, 32 మంది బ్రాహ్మణులకు రూ.93 లక్షలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. డిఆర్‌ఒ మురళి, ఆర్డీఓ కె.మధులత, వెనుకబడిన తరగతుల శాఖాధికారి శివనాగేశ్వరరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారత ఉద్యమాలకు పూలే ఆద్యం పోశారని శ్రీధర్ అన్నారు. నాయకులు కె.కిరణ్, కె.కోటిరెడ్డి, నరసింహారావు, చంద్రశేఖర్, నాగజ్యోతి, శ్రీనివాసరెడ్డి, వెంకట రామయ్య పాల్గొన్నారు.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.సీతారామ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక ఎల్‌ఐసి కార్యాలయంలో జ్యోతిరావు పూలే, బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్‌ఐసి జోనల్ జాయింట్ సెక్రెటరీ జి.నందికేశ్వరరావు, బ్రాంచ్ కన్వీనర్ పి.తిరుపతి స్వామి, బ్రాంచ్ మేనేజర్ జెవియస్ యస్ సురేష్ బాబు, పిఆర్‌కె వంశీ, ఎం.వసంతబాబు, వై.అప్పారావు, టి.రామారావు పాల్గొన్నారు. కవి కోకిల గుర్రం జాషువా సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం చేశారు.. డాక్టర్ అహ్మదుల్లా, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, ఎఎస్.ఆర్ జక్కం, జి.సురేష్‌బాబు, కె.ప్రేమకుమార్, జి.జాన్‌బాబు, పాల్గొన్నారు.



ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, నాయకులు కె.నాగ శ్రీను రాయల్, శ్రీనివాసరావు, సైదారావు, పివి సురేష్ బాబు, నాగేశ్వరరావు, సుబ్బారావు, మురళి యాదవ్, నరేంద్ర, ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - అమరావతి

స్థానిక సిపిఎం కార్యాలయం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. సామాజిక ఉద్యమ కార్యకర్త డి.ప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాల్ని వ్యతిరేకంగా పోరాడారని, వితంతు వ్యవహాలని ప్రోత్సహించారని, కార్మికులు, రైతు సమస్యల పైన బ్రిటిష్ అధికారులు, జమిందార్లకు విన్నవించారని గుర్తు చేశారు. నాయకులు ఎం.సుబ్రహ్మణ్యం, టి.కృష్ణ, నాగుల్ మీరా, బి.ప్రదీప్, టి.సూరిబాబు, బి.సూరిబాబు, రఫీ మోహిదీన్‌వలి పాల్గొన్నారు.



ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యు.అనిల్ కుమార్ అధ్యక్షతన జయంతి సభ నిర్వహించగా పూలే చిత్రపటానికి పలువురు పూలమాలలేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ మాట్లాడారు. గడియార స్తంభం సెంటర్లోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలేశారు. నసురుద్దీన్, శ్రీరామిరెడ్డి, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, స్వప్న కుమార్ పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలోనూ విగ్రహానికి ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజరమేష్ పూలమాలలేసి మాట్లాడారు. మునీర్ హసన్, లీలా కిషోర్, శివశంకర్, పఠాన్ ఖాదర్ బాషా, కరిముల్లా పాల్గొన్నారు.

ప్రజాశక్తి- రెంటచింతల

టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో నివాళులర్పించారు. విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఇ వెంకటరమణ, ప్రిన్సిపల్ మోహన్ విద్యావేత్త ఎన్.శ్రీనివాసరావు మాట్లాడారు.

ప్రజాశక్తి - మాచర్ల

సమాజంలో కులవ్యవస్థ నిర్మూలన ,స్త్రీ,పురుషులకు సమాన హక్కుల కోసం ఎంతగానో పోరాడిన సామాజిక యోధుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని, అట్టడుగువర్గాల ఆత్మగౌరవ పోరాటానికి విద్యనే



ఆయుధంగా అందించిన పూలే మహాశయుని ఆశయసాధనకి కృషి చేయడం మనందరి బాధ్యతని స్పెషల్ ఆఫీసర్ గబ్రూనాయక్, తహశీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, ఎంపిడిఒ ఫణికుమార్‌నాయక్, ఏవో లక్ష్మారెడ్డి, ఎంఇఒ అల్లి సురేష్ పాల్గొన్నారు. విద్యుత్ డివిజన్ ఆఫీస్ ఆవరణలో చిత్రపటానికి మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.సింగయ్య, అసిస్టెంట్ ఎకౌంట్ ఆఫీసర్ చంద్రశేఖర్ పూలమాలలేశారు. విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు, సిహెచ్. కోటేశ్వరరావు ఏఈలు రాంబాబు, జలగం శ్రీనివాసరావు, రవీంద్ర, మంత్రు నాయక్, కొమెర సిద్దయ్య,బత్తుల కొండలరావు, నరసింహారావు పాల్గొన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని విగ్రహానికి టిడిపి పట్టణ అధ్యక్షులు కె.దుర్గారావు పూలమాలలేశారు. అనంతరం కేకును కట్ చేశారు. నాయకులు ఒ.క్రాంతి, జె.నాగేశ్వరావు, భదన్‌బాయ్, పి.పిచ్చయ్య, బి.శ్రీను, కె.శ్రీను, కె.నాగేశ్వరావు, యు.దుర్గారావు పాల్గొన్నారు. దళిత బహుజన భీమ్ సేన ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులోని విగ్రహానికి పూలమాలలేశారు. రాష్ట్ర అధ్యక్షులు పి.జార్జి, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

జ్యోతిరావు పూలే విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకులు ఆర్.జగ్గారావు మాట్లాడారు. వినుకొండ డిసి చైర్మన్ జి.వేణుగోపాలరావు, మండల అధ్యక్షులు టి.బాలయ్య, ఎం.ప్రసాద్, కె.కోటేశ్వరరావు, కె.శ్రీహరి పాల్గొన్నారు.






వైసిపి నాయకులు, హోంగార్డు కలిసి ఇరిగేషన్ భూమి ఆక్రమణ

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని గ్లోరి క్రైస్తు చర్చి ఎదురుగా కబ్జాకు గురైన ఇరిగేషన్ భూమిని మాచర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. నాగులవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు బూడిద శ్రీను, అనుములపురి రాధా, నాగార్జున సాగర్ పోలీస్ స్టేషన్ హోమ్ గార్డ్ అర్జున్ ఈ భూ దందాలో పాలుపంచుకున్నట్లు ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల విచారణలో నిర్ధారణ అయినట్లు తహశీల్దార్ తెలిపారు. ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు వేసి విక్రయించడం నేరమన్నారు. భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. తదుపరి చర్యల కోసం వివరాలను జల వనరుల శాఖ అధికారులకు నివేదిస్తామన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



తుళ్లూరులో భిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు




అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఎం రవి, కార్మికులు

రాజధానిలో పారిశుధ్య కార్మికుల భిక్షాటన

పెండింగ్ జీతం కోసం ఆకలియాత్ర

ప్రజాశక్తి - తుళ్లూరు

పెండింగ్ జీతం చెల్లించండి మహాప్రభో.. అంటూ ప్రభుత్వానికి, అధికారులకు ఎన్ని విన్నపాలు చేసినా, నిరసన తెలిపినా ప్రయోజనం లేకపోవడంతో రాజధాని అమరావతి లోని పారిశుధ్య కార్మికులు చేసేదిలేక శుక్రవారం భిక్షాటన చేశారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించమంటూ స్థానిక గ్రంథాలయం సెంటర్ నుంచి సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయం వరకు ఆకలియాత్ర జరిపారు. పారిశుధ్య విధులు నిర్వర్తించే కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం సరైంది కాదంటూ గ్రామస్తులు కార్మికులకు మద్దతు పలికారు.కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్మికులు భిక్షాటన అనంతరం సిర్‌డిఎ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు.గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసేందుకు ధరఖాస్తు ఫారం ఇవ్వాలని కోరగా అధికారులు తటపటాయించారు. గం1 వరకు గ్రీవెన్స్ నిర్వహించాల్సి ఉండగా గం 12లకే ముగిసిందంటూ చెప్పారు. దీంతో కార్మికులు నిరసన తెలపడంతో అధికారులు దరఖాస్తు ఫారం అందజేశారు. దీంతో కార్మికులు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవి అధికారులకు మరోసారి వినతిపత్రం అందజేశారు. కార్మికుల ఆందోళనతో అధికారులు స్పందించారు. శుక్రవారం పెండింగ్ జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ సంద ర్భంగా రవి మాట్లాడుతూ, రాజధాని పారిశుధ్య కార్మికులకు ఫిబ్రవరి, మార్చి నెల జీతాలు ఇవ్వలేదని, ఏప్రియల్ నెల గడుస్తున్నా ఎలాంటి స్పందనా లేకపోవడంతో గత్యంతరం లేక రోడ్డున పడి బిక్షాటన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికుల ఆకలి యాత్ర, భిక్షాటనకు ప్రజలు స్పందించి ఆర్థిక సహాయం చేయడమే గాక,ఇన్నాళ్లు జీతాలు ఇవ్వకపోతే పనులు ఎలా చేస్తారంటూ మద్దతు తెలిపారని అన్నారు. జీతాలు చెల్లించమని కోరుతూ అధికారులకు పదేపదే అర్జీలు అందజేసినప్పటికీ అధికారులు, ప్రభుత్వం ఏమాత్రం స్పందించక పోవడంతో అనివార్యంగా మండుటెండలో వీధుల్లో ఆకలి యాత్ర నిర్వహించి, భిక్షాటన చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఆకలియాత్ర, భిక్షాటనకు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యపు వైఖరే కారణమన్నారు. ఇచ్చిన హామీ మేరకు జీతం వెంటనే చెల్లించకపోతే విజయవాడలో కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి భిక్షాటన చేపడతామని రవి హెచ్చరించారు. పెండింగ్ జీతాల చెల్లింపుతో పాటు రాజధాని పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న విధంగా రూ.21 వేలు జీతం ఇవ్వాలని, నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఎల్.సుఖవేణి, ఎన్. వీర్లంకమ్మ, శివపార్వతి, టి.బుజ్జి, ఎం.మేరి, లక్ష్మీ తిరుపతమ్మ, కోటేశ్వరరావు, రజని తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న ఎంటిఎంసీ పన్ను కలెక్షన్ కౌంటర్లు..

ప్రజాశక్తి - మంగళగిరి

ఆస్తి పన్ను చెల్లించటానికి మూడు రోజులే గడువు ఉన్న నేపథ్యంలో మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయాల్లోని ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ఏప్రిల్ 12,13,14 సెలవు దినాలయి నప్పటికీ పని చేస్తాయని నగర పాలక సంస్థ కమిషనర్ అలీం బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం రాయితీని వినియోగించుకొని పన్ను చెల్లించడానికి గడువును ఈ నెల ఆఖరు వరకు పొడిగించినట్లుగా ఆయన పేర్కొన్నారు.

పెంచిన ఆస్తి పన్ను ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి విలువ ఆధారితతో పెంచిన ఆస్తి పన్నును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్‌లాల్, సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘ వులు, పి బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేయకుండా అదేవి ధంగా ఆస్తి పన్ను పెంచుతుందని విమర్శించారు. ఉపసం హరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తనపై చేసిన ఆరోపణలు అవాస్తవం

ఎపి అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ

ప్రజాశక్తి - గుంటూరు


మాట్లాడుతున్న దీప్తి మనోజ

వ్యక్తిగతంగా, యూనియన్ ప్రతిష్ట దెబ్బతీయాలనే ఆలోచనతో అవాస్తమైన నిందారోపణలు చేయటం సరైనది కాదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ అన్నారు. శుక్రవారం పాతగుంటూరులోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో తనపై పోస్టులకు డబ్బులు తీసుకున్నానని ఆరోపిస్తూ ముత్యాలరెడ్డి నగర్‌కు చెందిన వర్కర్ రాజేశ్వరి చేసిన ఫిర్యాదులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అవన్నీ తన వ్యక్తిగత ప్రతిష్ట, యూనియన్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఉందని అన్నారు. ఎటువంటి సాక్ష్యాలు ఉన్నా నిరూపించాలని, నేను పోస్టులకు సంబంధించి ఎటువంటి డబ్బులు తీసుకోవడంగాని ఇతర వ్యవహారాలతోగానీ సంబంధం లేదని తెలిపారు. రాజేశ్వరి తన తప్పులకు నేనుగానీ యూనియన్ గానీ సపోర్టుగా ఉండలేదనే నెపంతో ఇటువంటి ఆరోపణలు చేస్తుందన్నారు. సాక్ష్యాలతో నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధమేనని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి మాట్లాడుతూ అంగనవాడి వర్కర్స్ హెల్పర్స్ సమస్యలపై యూనియన్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. రాజేశ్వరి సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేయటం సరికాదన్నారు. తప్పు చేసినట్టు నిరూపిస్తే ఎవరిపైన అయినా తగిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కోశాధికారి టి.రాధా, జిల్లా ఉపాధ్యక్షులు పి. ధనలక్ష్మి, నాయకులు బాజీబీ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోయండి

- యూనివర్సిటీల్లో పరిశోధనలు పెరగాలి
- బెర్హంపూర్ బసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆశోక్ కుమార్ గంగూలి
- నలుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ పరిశోధనా పురస్కారాలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్




జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ గంగూలి, ఉత్తమ పరిశోధనా పురస్కారాలను అందుకున్న డాక్టర్ పార్థ, మురళి, దినేష్, హరీష్

పరిశోధనా సామార్ధ్యాలను పెంచుకుని సృజనాత్మకతతో కూడిన నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు ప్రాణం పోయాలని బెరంపూర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్స్ (ఐసర్) డైరెక్టర్ మరియు ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ అశోక్ కుమార్ గంగూలి సూచించారు. శుక్రవారం ఉదయం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆడి టోరియంలో 'యూనివర్సిటీ 9వ రీసెర్చ్ డే సదస్సు జరిగింది. వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ క్కుమార్ ఆరోరా సదస్సుకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ అశోక్ కుమార్ విద్యార్థులు, ప్రొపెసర్ల నుద్దేశించి ప్రసంగిం చారు. బోధనతో పాటు పరిశోధనల్లోనూ విద్యార్థులకు ఆసక్తి పెరిగేలా ప్రొఫెసర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా యూనివర్సిటీలో జరుగుతున్న పరిశోధనలు, సాదించిన ప్రగతిని వివరిం చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి అశోక్ కుమార్ను నిర్వాహకులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను ప్రధానం చేసారు. రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ దాపా మాట్లాడు తూ రీసెర్చ్ నేసు పురస్కరించుకుని కిండబేజాద్ మాదిరిగా నలుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ పరిశోధనా పురస్కారా లను ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఉత్తమ ప్రయోగాత్మక పరిశోదన పురస్కారాన్ని డాక్టర్ మాసం పార్థ సారధికి, ఉత్తమ థియోలాటికల్ రీసెర్స్ అవార్డును డాక్టర్ ఎండూరి మురళీ క్రిష్ణకు. ఉత్తమ పారిశ్రామిక రంగ పరిశోధనా పురస్కారాన్ని డాక్టర్ దినేష్ రెడ్డికి, ఉత్తమ యువ పరిశోధక పురస్కారాన్ని డాక్టర్ హరీష్ పుష్పాలకు అందజేస్తున్నామన్నారు. అనంతరం 17 మంది యూజీ, పీజీ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ఎడుగురికి సిల్వర్ మెడల్స్ అందజేశారు. అదేవిధంగా 10 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు గోల్డు మెడల్స్, ఐదుగురికి సిల్వర్ మెడల్సు. ప్రశంసా పత్రాలను అందజేశారు. యూనివర్సిటీ రిజిస్టార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ డీ కన్వీనర్ డాక్టర్ సునీల్ చిన్నదురై, డాక్టర్ ఆయాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మండలం చిన్న కాకాని గ్రామంలో ఆదివారం జరిగే వంద పడకల ప్రభుత్వాసుపత్రి శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి సమగ్ర సాధన కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, ఇంకా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని పేర్కొంది. 13వ తేదీ ఉదయం ఆసుపత్రి నిర్మాణ కార్యక్రమానికి శంకుస్థాపన జరుగుతుందని తెలిపింది.

విఎస్ఆర్ కళాశాలలో ఫేర్‌వెల్ ఉత్సవాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తల్లిదండ్రుల కష్టంతో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, వారి ఆశయాలకు అనుగుణంగా స్థిరపడాలని నాసా విశ్రాంత శాస్త్రవేత్త చందు సాంబశివరావు అన్నారు. స్థానిక ఎన్విఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ కళాశాల ఆడిటోరియ ంలో శు క్రవారం నిర్వహించిన ఫేర్‌వెల్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గున్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన సాంబశివరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల కరెస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ కళాశాలలో పూర్వ విద్యార్థిగా విద్యనభ్య సించిన సాంబ శివరావు శాస్త్రవేత్తగా ఖ్యాతి గడించడం గర్వకారణ మన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో హెూరెత్తించిన విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ఉర్రూతలూ గించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.బి.ఎన్. అజయ్, అధ్యాపకులు లిల్లీ, శ్రీధర్, నాగార్జున, స్వాతి, అరుణ పాల్గొన్నారు.

129 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి



ఎసిసిసి మెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి 129వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో డి.సువర్చలాదేవి, ఎం.శారద, వి.లక్ష్మి, డి.రమణ, వి.కాశమ్మ కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కొరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం గురవయ్య, ఈ విశాలాంధ్ర, డి దానయ్య, కె హగ్గయ్య, వై సుబ్బారావు, టి నాగేశ్వరరావు, యెహెూషువ, టి.దుర్గ భవాని, ఎం.శివకుమారి, ఈ.సారమ్మ, ఎస్.బెంజిమెన్ పాల్గొన్నారు.

జొన్నాదుల మల్లేశ్వరికి రూ. 6 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి పట్టణంలోని బ్యాంకు కాలనీకి చెందిన జన్నాదుల మల్లేశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని అర్కా హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన మల్లేశ్వరికి వైద్యం చేయించే స్తోమత లేక వారి కుంటుంబ సభ్యులు స్థానిక నాయకుల ద్వారా మంత్రి నారా లోకేష్‌ను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన మంత్రి నారా లోకేష్ సీఎం సహాయ నిధి నుంచి మల్లేశ్వరి వైద్యానికి అవసరమైన రూ. 6,00,000 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) మంజూరు చేయించి బాధిత కుటుంబానికి శు క్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ...

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి దేవస్థానం ఆవరణలో శ్రీ రాధాకఅష్ణా యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభమవు తుందని యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు, ప్రధాన యోగాచార్యులు పడమట రాధాకృష్ణా యోగి గురూజీ తెలిపారు. మూడు వారాలు పాటు జరిగే యోగ శిక్షణ శిబిరంలో యోగాస నాలు, ప్రాణాయామం, ధ్యానంలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుం దన్నారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురూజీ విజ్ఞప్తి చేశారు.

టేస్టీ సాల్ట్ ఆరోగ్యానికి హానికరం


పజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్కిల్ హబలో ఏ.పి. వినియోగదారుల సంఘం ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞనారాయణ మాట్లాడుతూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వినియోగించే టేస్టింగ్ సాల్ట్ ప్రమాదకరమనీ, దీన్ని ఆహార పదార్థాలలో వాడటంవల్ల అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. ఆహార పదార్థాలు కొనుగోలు చేసే టప్పు డు తయారు తేదీ, ఎక్స్పైరీ తేదీ, తయారుదారిని వివరాలు, కస్టమర్ కేర్ నెంబర్ తప్పని సరిగా పరిశీలిం చాల ని, గడువు తీరిన వస్తువులను కొని నష్టపోవద్దని వివరిం చారు. వినియోగదారుల వ్యవహా రాలు, ఆహార, పౌరసర ఫరాల శాఖ కమిషనర్ వినియోగదారుల అవగాహన నిమిత్తం తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ లీగల్అడ్వైజర్ ఆవులమంద కమలా కర్, స్కిల్ హబ్‌ట్రైనర్ షైక్ మీరబి, ఏ.పి. విని యోగ దారుల హక్కుల పరిరక్షణా సంస్థ గౌరవ సలహా దారు సి. శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఆర్గనై జింగ్ సెక్రటరీ కె.కిరణ్ కుమార్, సంస్థ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు ఓ.రమాదేవి, పాల్గొన్నారు.

భాష్యంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక తిమ్మాయిపాలెం రోడ్డులోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ షేక్ దస్తగిరి సతీమణి కౌన్సిలర్ షేక్ షకీల, మున్సిపల్ శ్యానిటరీ ఇన్స్పెక్టర్ షేక్. ఇస్మాయిల్ హాజరయ్యారు. ముందుగా అతిథుల చేతుల మీదుగా చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం చేసి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ చిన్నారులు క్రమశిక్షణతో ఉంటూ చక్కగా చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోకూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉచిత మెటీరియల్ అందజేస్తున్న రమేష్‌బాబు

కొనసాగుతున్న ఉచిత పాలీసెట్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల:- యుటిఎఫ్ ఎస్ఎఫ్ఐ జె వి వి ఆధ్వర్యంలో ఉచిత పాలీసెట్ శిక్షణ తరగతులు విజయవంతంగా ఎనిమిదో రోజుకు చేరుకున్న సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం లయోలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అడ్మిషన్స్ ఇన్చార్జ్ ఎం రమేష్‌బాబు ఉచితంగా పాలీసెట్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లా డుతూ విద్యార్థులు ఈ శిక్షణ తరగతులు వినియోగిం చుకొని పరీక్షల్లో విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కాసిం పీరా, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.జమాల్, పాలీసెట్ కోఆర్డినేటర్ దొంతగాని శ్రీనివాసరావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు సాంబశివరావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు ప్రశాంత్ రాజు, ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రోహిత్, జెవివి హనుమంతరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు



పోపూరి వెంకట్రావు (ఫైల్)

యడ్లపాడుకు చెందిన మాజీ సర్పంచ్ పోపూరి వెంకట్రావు (86) స్వగృహంలో శుక్రవారం మృతి చెందారు. 1967-71 మధ్య ఆయన గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. అంతకు ముందు రెండు పర్యాయాలు యడ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పని చేశారు.ఆయనకు భార్య వెంకటరత్నం, కుమారులు బ్రహ్మా తనందం, వెంకటేశ్వర్లు (చిన్నా), కోడళ్లు రాజేశ్వరి, సజన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు వాట్సప్ ద్వారాసమాధానాలు : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇక నుంచి జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల అర్జీలకు అర్జీదారుల వాట్సాప్‌కు సమా ధానాలు పంపనున్నామని కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. కేవలం వాట్సప్‌కే పరిమితం కాకుండా అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోస్టు ద్వారా అర్జీదారుడి ఇంటికే చేరవేస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా సైతం ఒక కాపీ నేరుగా ఫిర్యాదు దారుడికి అందిస్తామన్నారు. సాంకేతికతతో పాటూ సంప్రదాయ సమాచార మార్గాల సమర్థవంతంగా వినియోగించుకుని పీజేఆర్ఎస్ ను ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను పటిష్టపరచాలన్న ముఖ్యమంత్రి, ఉపముఖ్య మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలప్రత్యేక అధికారులు అర్జీదారులతో మాట్లాడాలని పీజీఆర్ఎస్‌ను బలోపేతం చేయడంలో మండల ప్రత్యేక అధికారులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఆదేశించారు. నేరుగా అర్జీదారుల వద్దకే వెళ్లి ఫిర్యాదులపై అధికారుల స్పందన, పరిష్కారాల్లో నాణ్యత, ప్రజలతో అధికారులు వ్యవహరించే తీరును సమీక్షించాలన్నారు.

ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించండి : గబ్రూనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గబ్రూనాయక్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని మండల ప్రత్యేక అధికారి గబ్రూనాయక్ అన్నారు. మాచర్ల తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలపై మండల్ లెవెల్ అధికార్లతో మండల స్పెషల్ అధికారి గబ్రూనాయక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్సులకు వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులను కోరారు. ఇప్పటి వరకు ఎన్ని అర్జీలు అందాయి. ఎన్ని సమస్యలు పరిష్కరమయ్యాయి. ఏఏ శాఖల వద్ద సమస్యలు పెండింగులో వున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణకుమర్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎంపిడీవో ఫణికుమార్ నాయక్, ఏవో లక్ష్మారెడ్డి, ఎంఈవో అల్లి సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

పల్నాడు వైసిపి అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల :

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేని నాయకులు, వాటి గురించి ప్రశ్నిస్తున్న జగన్మోహన్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేయటం మానుకోవాలని పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మాచర్ల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పిన్నెల్లి మాట్లాడుతూ లావు శ్రీకష్ణదేవరాయలుకు ఏమాత్రం అనుభవం లేకపోయినా, యువకులను ప్రోత్సహిం చాలన్న ఉద్దేశంతో వైయస్ జగన్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించా రన్నారు. ఎన్నో అలివి కానీ వాగ్దానాలు చేసి, అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. పండించిన పంటలకు ధరలు లేక రైతులు అల్లాడి పోతున్నారన్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీ లు నెరవేర్చాలని, ఆడలేక మద్దెల ఓడు అన్నట్టు ఇచ్చిన హామీల అమలు గురించి ప్రశ్నిస్తున్న జగన్ పై ఆరోపణలు చేయడం హాస్యాస్పద మన్నారు. రోజులు ఎప్పుడు ఒకే రకంగా ఉండవని హెచ్చరించారు.

వివాదాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి- నకరికల్లు

గ్రామాలలో ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ పీ. కిరణ్ తెలిపారు. మండలంలోని చీమల మర్రి గ్రామాన్ని శుక్రవారం సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామంలో ప్రతి కూడలి వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజల సహకరించాలన్నారు. రోడ్లపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని , అతివేగంతో వాహనాలను నడపరాదని సూచించారు. మగ పిల్లలకు ప్రతి తల్లిదండ్రులు మహిళలను గౌరవించడం నేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు ఇవ్వండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలను వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి. రవిబాబు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధి హామీ బైక్ యాత్రలో గుర్తించిన సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్దలింగ మూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు ఏడు వారాలు వేతనాలు రావాల్సి ఉందనీ, సకాలంలో వేతనాలు ఇవ్వకపోతే కుటుంబ అవసరాలు ఏ విధంగా తీరుతాయని ప్రశ్నించారు. నాదెండ్ల మండ లం తూబాడు గ్రామంలో గత ఉపాధి హామీ పనుల సీజన్లో నాలుగు వారాలు పనిచేసిన కూలీలకు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల వేతనాలు అందక పోతే సోషల్ ఆడిట్‌లో అధికారులకు ఫిర్యాదు చేయగా వారం వేతనం మాత్రమే ఇచ్చారనితెలిపారు.పని ప్రదేశంలో ఫస్టఎయిడ్ కిట్లు, టెంట్లు మజ్జిగ, మంచినీటి సౌకర్యాలు.ఉపాధి హామీ జాబ్ కార్డులు అందని వారికి జాబ్‌కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె. రోశయ్య, నాయకులు కె.నాగేశ్వరరావు,జె.భగత్, శేషయ్య పాల్గొన్నారు.




పిడికి వినతిపత్రం ఇస్తున్న వ్య.కా.సం. నాయకులు

స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యంతోనే ఇంటికి వెలుగు

జిల్లా సహకార శాఖ అధికారి ఎం. వెంకటరమణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఒక్క మహిళ ఆర్థికంగా స్వతంత్రంగా మారితే ఒక కుటుంబం వెలుగులోకి వస్తుందని మరి అలాంటి లక్షల కుటుంబాలకు మహిళా పొదుపు సహకార సంఘాల ద్వారా వెలుగులు నిండుతున్నాయని జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ అన్నారు. కోటప్పకొండలోని జిల్లా సమాఖ్య సమావేశంలో శుక్రవారం అధ్యక్షురాలు కోయ రజని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా వెంకటరమణ, జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లా స్థాయి సెమినార్‌లో వెంకటరమణ మాట్లాడారు. సహకార సంఘాలు సభ్యుల శ్రమ, నమ్మకం పరస్పర సహాయంపై ఆధారపడి పనిచేస్తాయన్నారు. ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా సమాఖ్య ప్రతి నిధులు, డిపిఎం హనుమా నాయక్, ఏపిఎం లు జగజ్జీవన్, భరత్, స్త్రీ నిది ఏజీఎం. చిన్న బుల్లయ్య, ఎల్ సి. నాగుల్ మీరావలి, జిల్లా సమాఖ్య అకౌంటెంట్ పాల్గొన్నారు.



మహాత్మా పూలేకు నివాళి అర్పిస్తున్న అతిథులు, మహిళలు

జాతీయ పురస్కారానికి ఎంపికైన శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - పెదకూరపాడు



శ్రీనివాసరెడ్డి

పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. శ్రీనివాసరెడ్డికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం ఇస్తున్నట్లు పుడమి సాహితీ వేదిక తెలంగాణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులుగా, వ్యాసకర్తగా విద్యారంగంలో, సామాజిక రంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని శ్రీనివాసరెడ్డికి ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 13వ తేదీ ఆదివారం నల్గొండ జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. శ్రీనివాస రెడ్డిని పలువురు అభినందించారు.



ధర్నాలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

రెండవ రోజు కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి - వినుకొండ

నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని డిపోల ఎదుట శుక్రవారం వినుకొండ డిపో గ్యారేజీ గేటు ఎదుట రెండో రోజు ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమానికి డిపో గౌరవ అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి కమిటీ చైర్మన్ పివిఎస్.ఆర్ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీలో చాలా మంది ఉద్యోగులు 50 ఏళ్లు పైబడిన వారనీ, వారికి సరైన వైద్యం అందడం లేదని, పెండింగ్ డిఏలు ఇంతవరకు చెల్లించలేదని, రిటైర్డ్ ఉద్యోగులకు సూపర్ లగ్జరీలో ప్రయాణం అనుమతించాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భత్యం పెంచాలని, 1/2019 సర్క్యులర్ అమలు పరచాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ పనిష్మెంట్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పైసమస్యలు పరిష్కరించని పక్షంలో అవసరమైతే సమ్మెకు దిగుతామని డిపో అధ్యక్షులు సౌభాగ్య రాజు హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో వి.ఎస్.పి నాయక్, ముప్పాళ్ళ శ్రీను, వైవి ఆంజనేయులు, కె.ఆ దెయ్య, హరిహర బాబు, కఠారి, డిఎస్, శేషగిరి, గ్యాస్‌వలి, ఎం.కే, జి ఎన్ రావు,కె. ఎస్.ఎన్ రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

పౌష్టికాహార పక్షోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి బెల్లంకొండ:

బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామంలో శుక్రవారం అంగన్వాడి టీచర్లు వెయ్యి రోజుల పౌష్టికాహార పక్షోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో చిన్నపిల్లలకు గర్భిణీలకు బాలింతలకు పోషకాహార లోపంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చిరుధాన్యాలు ఆకుకూరలు పండ్లు తీసుకోవాలని అంగన్వాడి టీచర్లు కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల, అంగన్వాడి టీచర్లు పీహెచ్సీ సిబ్బంది సచివాలయం సిబ్బంది బాలింతలు చిన్నారులు గర్భతులు పాల్గొన్నారు.

కంటి జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

కంటి జబ్బుల పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా వుండాలని ముఖ్యంగా వృద్ధాప్యంలో కంటి సమస్యల పట్ల శ్రద్ధ వహించాలని విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎల్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం అయన స్థానిక విశ్రాంతి ఉద్యోగుల భవన్లో డాక్టర్ రామలింగారెడ్డి మేక్సీ విజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన లాంచనంగా ప్రారంభించారు. 20 మందికి వైద్య పరీక్షలు సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమలో బొడ్డు రామారావు, పోతులురయ్య, సైదులు రమాదేవి, బాజిరెడ్డి, మల్లేశ్వరావు పాల్గొన్నారు

అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు పూలే





మంగళగిరి వైసీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు, తెనాలి టిడిపి కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులు, పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్, సిబ్బంది

ప్రజాశక్తి - మంగళగిరి

అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే మురుగుడు హనుమంతరావు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి బైపాస్ రోడ్డులోని మంగళగిరి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పులే అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిలోద్ధరణకు కఅషి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు ఊట్ల పాల శ్రీనివాసరావు, జిల్లా దివ్యాంగ విభాగాలు అధ్యక్షులు బక్క అగస్టియన్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకటకఅష్ణ, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, నియోజకవర్గ బీసీ అధ్యక్షులు తాడిబోయిన సుబ్బారావు, నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షులు పూజల మనోహర్, మహిళా నాయకురాలు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో..

ప్రజాశక్తి - మంగళగిరి

అణగారిన వర్గాల విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త- మానవతా మూర్తి మహాత్మా జ్యోతిబా పూలే అని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. శుక్రవారం మంగళగిరి పట్టణంలో గల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఉడతా శ్రీనివాసరావు, మోపిదేవి శివకృష్ణ, మొవ్వ మల్లికార్జున్, టి కిరణ్, నాగబాబు, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి టీడీపీ కార్యాలయంలో..

ప్రజాశక్తి - తెనాలి రూరల్

జ్యోతిభా పూలే 199వ జయంతి వేడుకలు తెనాలిలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పలువురు టిడిపి నాయకులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, పద్మాశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జాన్నాదుల మహేష్ మాట్లాడుతూ నీతి, మానవతావాదం, విద్య, సామాజిక సంస్కరణల్లో ఆయన కఅషి అనేకరంగాలులో విస్తరించిందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ బిసి సెల్ అధ్యక్షులు ఫణిదరపు దుర్గా మైనారిటీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, కుదరవల్లి శ్రీనివాసరావు, ఐటిడిపి నాయకులు మల్లవరపు విజయ్, ఎం వెంకట్, జాలా రవి నివాళిలర్పించారు. తెనాలి స్టేషన్ రోడ్డులోని ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ సెల్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు అక్కిదాసు కిరణ కుమార్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ భారత జాతిపిత, చదువుల తండ్రిగా బలహీన వర్గాల్లో ఆత్మస్థైర్యం నింపి, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన తొలితరం సామాజిక వేత్త పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో యతాటి అనీల్, జేసు బాబు, కె.శశి, బి.నాని, కుర్రా జస్వంత్, సాల్మన్, అరుణ్, బడుగు రమేష్, కె.నాగమల్లేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

ప్రజాశక్తి - తెనాలి

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని సబ్ కలెక్టర్ సంజన సింహ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి లక్ష్మిపతి, రెవిన్యూ ఆఫీసర్ రాంప్రసాద్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, మెప్మా విభాగాల సిబ్బంది, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చేబ్రోలులో..

ప్రజాశక్తి - చేబ్రోలు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే



అని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకొని పొన్నూరు పట్టణంలోని మామిళ్ళపల్లి బస్టాండ్ వద్ద వున్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిరావు పూలే అభిమానులు, కూటమి నాయకులు పాల్గొన్నారు..

కొల్లిపర మండలపరిషత్ కార్యాలయంలో..

ప్రజాశక్తి - కొల్లిపర

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన సేవలు అభినందనీయమని మండల పరిషత్ అధ్యక్షురాలు భీమవరపు పద్మావతి అన్నారు. శుక్రవారం కొల్లిపర మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి కార్యక్రమము నిర్వహించారు కార్యక్రమములో మండల పరిషత్ అధ్యక్షులు శ్రీమతి భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.విజయ లక్ష్మి తెనాలి డిఎల్‌పిఓ వి.స్వరూప రాణి పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో..

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో మహాత్మ జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. మహాత్మ జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి అధ్యయన కేంద్రం సంచాలకులు, విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘ



నాయకులు, పరిశోధకులు, విద్యార్ధిని విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభాధ్యక్షులు ఆచార్య త్రిమూర్తిరావు మాట్లాడారు. డాక్టర్. బాలబోయిన సుదర్శన్, షేక్ షరీన్ బేగం (ఐపీఎస్), రెక్టార్ ఆచార్య. రత్నషీలామణి, రిజిస్ట్రారు ఆచార్య. జి. సింహాచలం, పాలకమండలి సభ్యులు ఆచార్య. కే. సుమంత్ కుమార్, ఆచార్య ఎం. జగదీష్ నాయక్, ప్రిన్సిపల్ ఆచార్య. ఎం. సురేష్ కుమార్, ఆచార్య. కె. వీరయ్య , వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య. పాల్ కుమార్, డి ఈ ఎన్. వెంకటేశ్వర రావు, సిఈ ఏ. శివప్రసాద రావు, వై. రాధాకృష్ణ ఎం. వెంకట రమణ, కోటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసా హైస్కూల్ సోషల్ టీచర్ శిరీషకు ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - మేడికొండూరు



మండలంలోని మందపాడు గ్రామంలోని శ్రీనివాస హై స్కూల్ సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోషల్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న రెబ్బవరపు. శిరీష కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు సౌత్ రన్ ప్రైవేట్ లెక్చలర్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు, జలాల్ పురం గ్రామానికి సంబంధించిన శిరీష 12 ఏళ్లుగా ఉపాధ్యాయ వఅత్తిలో కొనసాగుతూ, అంకిత భావంతో పనిచేస్తు విద్యార్థుల అభివృద్ధికి పాటుపడుతుంది. విద్య, సామాజిక సేవారంగంలో విశేషమైన కృషి చేసినందుకుగాను భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ అవార్డును ఈనెల 13న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రముఖుల చేతుల మీదుగా అందుకోనున్నట్లు తెలిపారు.

ఐదవ రోజుకు చేరిన క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె శుక్రవారం నాటికి ఐదవ రోజు చేరింది. సమ్మె శిబిరాన్ని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణలు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నెలకు 12,500 రూపాయలు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, అయినప్పటికీ రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. వేతనాలు చెల్లింపుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కనీసం నెలకు 24500 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 16 నెలలుగా ఈఎస్ఐ, వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదని విమర్శించారు. ఐడి కార్డులు ఇవ్వడం లేదని అన్నారు. ఆప్కాస్ లో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె 5 రోజులుగా జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్ స్పందించడం లేదని విమర్శించారు. ఇదేవిధంగా



సమ్మె శిబిరంలో ఉన్న క్లాప్ ఆటో డ్రైవర్లు, సిఐటియు నాయకులు

సమ్మె కొనసాగితే పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కలగజేసుకొని వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు డి శివ, కార్యదర్శి ఎం రవి, యూనియన్ నాయకులు ఎం.యోహాన్, జె శ్రీకాంత్, ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు మద్దతు

ప్రజాశక్తి- తాడేపల్లి : తమ డిమాండ్ల సాధన కోసం ఎం టి ఎం సి కార్పొరేషన్ పరిధిలో సమ్మె చేస్తున్న క్లాప్ డ్రైవర్లు పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు సిఐ టి యూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు తెలిపారు. శుక్రవారం బ్రహ్మానందపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద క్లాప్ డ్రైవర్లు మరియు రాజధాని లోని మున్సిపల్ కార్మికులు తమకు రావాల్సిన జీతాలు కోసం చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కే స్టీవెన్, ఈ నరసింహారావు, రమాదేవి, దుర్గ భవాని, ఎం గురవయ్య, ఎస్.కె ఆరిఫ్, ఎం ఆశీర్వాదం, టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమైక్యత శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో సమైక్యత శంఖారావం వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనందరము భరతమాత ముద్దుబిడ్డలమేనని, మతోన్మాదం మానవాళికి శత్రువని ఆ మతోన్మాద రక్తసి రెక్కలు విరిచేద్దాం దేశ లౌకిక వారసత్వాన్ని కొనసాగిద్దాం అనే నినాదంతో సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మోనీ వారి ఆధ్వర్యంలో సమైక్యతా శంఖారావం పేరుతో ఆదివారం ఉదయం విజయవాడ మొగల్రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో మతసామరస్యంపై జాతీయ సదస్సు జరుగుతుందనీ తెలిపారు. ఆత్మకూరు ప్రజాసంఘాల నాయకులు వుద్దంటి దుర్గారావు గడ్డం అజయ్ కుమార్ షేక్ సలాం చిట్టేల జనార్ధనరావు షేక్ నాగుల్ మీరా మేడ శివకఅష్ణ పులివర్తి జిజయ్య కోరారు అనంతరం సమైక్యతా శంఖారావం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ

ప్రజాశక్తి - చేబ్రోలు

శుక్రవారం 88 పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని చేబ్రోలు బిఎల్వోలు మరియు సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. తహశీల్దారు కె.శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి పొన్నూరు ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి టి.వి.విజయ లక్ష్మి ముఖ్యఅతిథులగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ జాబితా మార్పు చేర్పులు అనగా చనిపోయి వారి పేర్లు తొలగించాలని, జెండర్ తప్పులు సరి చేసేందుకు, ఒక కుటుంబం ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధముగా చేయాలని, డబుల్ ఓటర్లు తొలగించాలని అన్నారు. ఓటర్ల జాబితాలో ఎప్పటి కప్పుడు మార్పులు చేర్పులు చేయు సందర్భంలో సమగ్ర విచారణ, సంబంధిత కుటుంబ సభ్యుల అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ పొన్నూరు, బిఎల్‌ఓలు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణ పరిదిలోని అన్ని ఉప విద్యుత్ కేంద్రాల్లో మరమ్మత్తులు అలాగే విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్ములు తొలగుంపు కారణంగా పట్టణంలో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపిసిపిడిసిఎల్ ఆపరేషన్ సబ్ డివిజన్ తెనాలి డిఈ బోరుగడ్డ అశోక్ కుమార్ శుక్రవారం ప్రకటన ద్వారా తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు అధికారులకు సహకరించాలని ప్రకటనలో కోరారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈనెల 13వ తేదీ విజయవాడ మొగల్రాజపురం లోని పిబి సిద్ధార్థ ఆడిటోరియంలో జరగనున్న సమైక్యత శంఖారావం సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ నాయకులు ఎం.రవి కోరారు. ఆమేరకు ఉండవల్లి సెంటర్ ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం వాల్పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. సదస్సులో పెద్ద ఎత్తున పాల్గొని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.వెంకటేశ్వరరావు, టి.బక్కిరెడ్డి, ఆర్.వి.రాఘవయ్య, ఎస్. వెంకట్ నారాయణ, పార్థసారథి, ఎం సాంబశివరావు, చెంచయ్య, మస్తాన్ రావు, రామ కృష్ణ, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో రైతులకు సమయం ఆదా



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌కేవివై పథకము క్రింద రైతుల గ్రూపులకు 80శాతం సబ్సిడీపై 'విల్లజి ఫారం మెషినరి బ్యాంకులు' క్రింద కిసాన్ డ్రోన్ల పంపిణీ కార్యక్రమంపై శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయా నమూనాలతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో డ్రోన్ల తయారీదారులు డ్రోగో డ్రోన్స్, విహంగ టెక్నాలజీస్ వారు ఎంపిక చేసిన రైతు బృందాల కన్వీనర్లు, కోకన్వీనర్లకు కలిగిన సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా వ్యవసాయా శాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు డ్రోన్ల వినియోగంతో ఎంతో సమయం ఆదా చేసుకోవటమే కాకుండా, ఇతర రైతులకు సేవాభావంతో సహేతుక ధరలకు పిచికారి చేసే అవకాశం లభిస్తుందన్నారు. డ్రోన్ తయారీ కంపెనీ ప్రతినిధులు రవికుమార్, సుధీర్‌లు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు డ్రోన్లను కొనుగోలు చేయటానికి రుణం సత్వరం ఇప్పింటానికి అన్ని బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అధికారులు, అగ్రోస్ వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జిపై ప్రజాప్రతినిధులు స్పందించాలి : సిపిఎం



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

శంకర్ విలాస్ రైల్వే బ్రిడ్జి డిజైన్ విషయంలో ప్రజాప్రతినిధులు స్పందించాలని సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పాత డిజైన్ ప్రకారం నిర్మించాలని గత రెండు నెలలుగా పౌర సంఘాలు ఆందోళన చేస్తున్నా ప్రజాప్రతినిధులు బాధ్యత లేకుండా ఉన్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి పౌర సంఘాలతో చర్చించాలని, ప్రజాభిప్రాయం మేరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. విజనరీ లీడర్‌గా చెప్పుకునే చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో ముందుచూపు లేకుండా బ్రిడ్జిని నిర్మిస్తున్నారని అన్నారు. 2017లోనే రూ.162 కోట్లు అవసరం అని అంచనా వేసిన బ్రిడ్జికి ఇప్పుడు రూ.98 కోట్లే మంజూరు చేసి, బ్రిడ్జి పొడవు కుదించటం సరికాదన్నారు. లాడ్జి సెంటర్ నుండి హిందూ కాలేజి వరకూ బ్రిడ్జి నిర్మించాలని, అండర్‌పాస్‌లు కూడా ముందుగానే ఏర్పాటు చేయాలని పౌర సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయన్నారు. కానీ అధికారులుగానీ, స్థానిక ప్రజాప్రతినిధులుగానీ స్పందించట్లేదన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే రాబోయే కాలంలో కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఓవర్ బ్రిడ్జి కంటే ముందే అండర్‌పాస్ నిర్మిస్తేనే ట్రాఫిక్ రద్దీని నియంత్రించటం సాధ్యం అవుతుందన్నారు. 'విజనరీ లీడర్ ప్రభుత్వంలో ముందు చూపులేని శంకర విలాస్ బ్రిడ్జి నిర్మాణమా?' అనే కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపియం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, నాయకులు షేక్.ఖాశింషహీద్, ఆది నికల్సన్ పాల్గొన్నారు.

జిఎంసికి తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ పుష్‌కాట్స్ అందజేత



కార్మికులకు పుష్‌కాట్స్ అందచేస్తున్న ఎమ్మెల్యేలు, కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చి దిద్దుకోవడానికి జిఎంసి చేస్తున్న కృషిలో నగర ప్రముఖులు, వ్యాపార సంస్థలు భాగస్వాములు కావాలని జిఎంసి ఇన్‌ఛార్జి మేయర్ షేక్ సజీలా పిలుపు నిచ్చారు. శుక్రవారం తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు నగరపాలక సంస్థకు అందించిన 50 పుష్ కాట్స్‌ని కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, బ్యాంకు జిఎం అశోక్ కుమార్‌తో కలిసి ప్రజారోగ్య కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్ఫూర్తితో నగరాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దుకుంటా మన్నారు. కమిషనర్ మాట్లాడుతూ తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ వారికి ధన్యవాదాలు తెలిపారు. నగర ప్రముఖుల చేయూత ద్వారా నగరాన్ని మరింత వేగంగా అభివృద్ధి, స్వచ్ఛత కార్యక్రమాలు విరివిగా చేపడతా మన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ శర వేగంగా అభివృద్ధి చెందుతున్న గుంటూరు నగరంలో మౌలిక వసతుల కల్పనకు తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ వంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరిన వారు అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలన్న ముఖ్యమంత్రి స్ఫూర్తితో రాష్ట్రంలో ఇప్పటికే అనేక మంది, సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణపై వెల్లువెత్తిన నిరసన

కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్



తెనాలిలో

ప్రజాశక్తి- తాడేపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లిములకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని శుక్రవారం సాయంత్రం తాడేపల్లి పట్టణంలోని నులకపేట మజీద్ సెంటర్ నుండి తాడేపల్లి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లిం మైనార్టీలు ఈ కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలను అనిచి వేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. స్వాతంత్ర పోరాటంలో ముస్లిం సమాజం అనేక త్యాగాలు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని కూటం ప్రభుత్వం బిల్లుకు మద్దతు ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పటాన్ కాసింఖాన్, గొర్రె బాబు, ఎస్ కే శీను, సలీం భాష, అహ్మద్, భాష, సత్తార్, సుభాని, గని, కాజా భాయ్, ఇమ్రాన్, ఇర్ఫాన్, సైదులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి చేబ్రోలు : పొన్నూరు ఐలాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ముస్లింల వక్ఫ్ బోర్డు బిల్లును వెనక్కి తీసుకోవాలనే డిమాంతో నినాదాలు చేశారు.

ప్రజాశక్తి తెనాలి : వక్ఫ్ చట్ట సవరణ 2024 బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలో ముస్లిం సంఘాలు శుక్రవారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టాయి. స్థానిక శివాజీ చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధులలో కొనసాగింది. మజ్లిసుల్ ఉలామా-వల్ అయిమా, జమియతే ఉలామా హింద్ ముస్లిం సంఘాలు సంయుక్తంగా చేపట్టిన నిరసనలో ప్రభుత్వ తీరుకు నిరసనగా ఫ్ల కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిల్లు చట్ట సవరణకు మద్దతు తెలిపిన టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ ద్వారా ఆమోదం పొంది, పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ 2024ను దేశంలో ముస్లిం మైనారిటీలంతా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముస్లింల మతపరమైన హక్కులలో జోక్యం, రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేదిగా చట్ట సవరణ బిల్లు ఉందని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 26, 29, 30 ప్రకారం మతపరమైన ఆస్తులను పరిరక్షించుకోవడం వారి హక్కుని స్పష్టం చేశారు. దానికి భంగం కలిగించే చట్ట సవరణ ఆమోదయోగ్యం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముస్లింలకు న్యాయం చేయాలని కోరారు. ర్యాలీలో ముస్లిం సంఘాల నాయకులు, మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



పొన్నూరులో



తాడేపల్లిలో

దురాచారాలను రూపుమాపటానికి పూలే ఎనలేని కృషి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

అనాటి సమా జంలో సాంఘిక దురా చారాలు రూపు మాపడానికి, మహిళా విద్యకు మహాత్మ జ్యోతిభాపూలే ఎనలేని కృషి చేశారని గుం టూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాదవి అన్నారు. శు క్రవారం కలెక్టరేట్‌లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే 199వ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ హిందు కళాశాల సెంటరులో జ్యోతిబా పూలే సావిత్ర బాయి పూలే దంపతుల విగ్రహాలను సర్కిల్ ఏర్పాటు చేసేలా రానున్న జిఎంసి కౌన్సిల్‌లో తీర్మానం చేసి పనులు ప్రారంభించటం జరుగుతుందన్నారు. బిసి భవన్ నిర్మాణానికి ప్రభుత్వం, బీసీ పెద్దల సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు విద్య ద్వారానే అభివృద్ధి చెందుతారని ఎన్నో అవమానాలు భరించి మహాత్మ పూలే విద్యను అభ్యసించి సమజంలో అసమానతలు తొలగించటానికి ప్రజలను చైతన్య పరిచారన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవటం వలన నిలిచిపోయిన బీసీ ఇంటిగ్రేటడ్ హాస్టల్స్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 8 నెలల్లోనే రూ.93 లక్షలు కేటాయించటంతో నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బి.రామాంజనేయులు మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో సమాజంలో కుల సంకుచిత భావాన్ని రూపుమాపాల్సిన అవసరం ఉందన్నారు. సభలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, డిఆర్ఓ ఖాజావలి, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ కె.మయూరి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తొలుత హిందు కళాశాల సెంటరులోని పూలే విగ్రహానికి ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బి.రామాంజనేయులు, జిఎంసి ఇన్‌చార్జి మేయర్ సజీలా, నగర

జ్యోతిబా పూలేకు ఘన నివాళి

కమిషనరు పులి శ్రీనివాసులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

పూలేకు యుటిఎఫ్ నివాళులు



ప్రజాశక్తి-గుంటూరు

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక హిందూ కాలేజీ కూడలి వద్ద ఉన్న పూలే విగ్రహానికి యుటిఎఫ్ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లా డుతూ సామా జిక మార్పునకు, చైతన్యానికి విద్య యే సరైన సాధన మని గుర్తించి బడుగు బలహీన వర్గాలకు, మహిళ లకు విద్యను అందించడానికి కృషిచేసి పూలే మార్గదర్శగా నిలిచారన్నారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడు తూ సనాతన దురా చారాలపై తిరుగుబాటు బావుట ఎగరవేసి, సామాజిక న్యాయం కోసం పోరాడిన పూలే చిరస్మరణీయుడని అన్నారు. కార్యమ్రకంలో రాష్ట్ర కౌన్సిలర్ జి.శివ పూర్ణయ్య, జిల్లా కార్యదర్శులు ఎం.గోవిందు, బెల్లంకొండ ప్రసాదు, సిహెచ్.ఆదినారాయణ ఆడిట్ కమిటీ సభ్యులు ఎం. కోటిరెడ్డి, ఎం.ధనరాజారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : మహాత్మ జ్యోతిరావు పూలే 198 జయంతిని పురస్కరించుకొని నిడ మర్రు కంతేరు డొంకలోగల మహంకాళి అమ్మ చెట్టు వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్ర హానికి సిపిఎం నాయకులు గైరుబోయిన నాగేశ్వరరావు, ఎం భాగ్యరాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే నాగేశ్వరరావు, కే స్టాలిన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాశం రామారావు

పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-గుంటూరు: మహాత్మ జ్యోతిరావ్‌పూలే ఆశయాలను లక్ష్యాలను నేటితరం ముందుకు తీసుకువెళ్ళాని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం (జెవికె) మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా బ్రాడీపేటలోని జెవికెలో సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా నాయకులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రామారావు మాట్లాడుతూ పూలే తనజీవితాంతం మహిళల విద్య, అంటరానితనం, కులవివక్ష, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. దేశంలో సాంఘిక సంస్కరణ ఉద్యమంలో పూలే ముఖ్యమైన వ్యక్తి అన్నారు. మహిళలకు చదువు చెప్పటానికి ఎవరూ ముందుకు రాకపోతే తన భార్య సావిత్రిభాయ్ పూలేకు చదువు నేర్పి, ఆమేతో మహిళలకు విద్యనేర్పించారన్నారు. అందరికి విద్య, కులనిర్మూలన కోసం అహర్నిశలు పోరాడారన్నారు. సత్యశోధక సమాజం ఏర్పాటు చేసి సమాజ పరివర్తన కోసం కృషి చేశారన్నారు. నేతాజి మాట్లాడుతూ నాటి మనువాదానికి వ్యతిరేకంగా శ్రామిక ప్రజలను చైతన్యం చేశారని, బ్రహ్మణ వాదానికి వ్యతిరేకంగా శూద్రులుగా పిలవబడే అన్ని వత్తుల వారి హక్కుల కోసం కృషి చేశారన్నారు. పూలే స్ఫూర్తితో సామాజిక సమస్యల పరిష్కారంతో పాటు ఆర్థిక సమస్యలను కూడా మిళితంచేసి కార్మిక, కర్షకుల హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో సి.ఐ.టి.యు జిల్లా నాయకులు కె.నళీనీకాంత్, జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, నగర కార్యదర్శి బి.ముత్యాలరావు, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎస్.కె.సమీర్, ఎమ్.కిరణ్, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.